ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025 5 విజయనగరం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో
అక్రమాలు లేకుండా చూడాలి

కంటోన్మెంట్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవినీతి అక్రమాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి పి రమేష్ తెలిపారు. మంగళవారం తన ఛాంబర్ లో డివిజనల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ నెల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్ లను నియమించాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఐదు కేజీలు ఎక్కువగా సేకరించినట్లు వివరాలు వస్తున్నాయని వాటిని సరిదిద్దాలన్నారు. ధాన్యం తరలించే సమయంలో లేటు కాకుండా సకాలంలో బిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సహకార అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బడా కంపెనీ పేరిట నాడు భూ సేకరణ
ఎంఎస్ఎంఇ పేరుతో నేడు జిందాల్‌కు ధారాదత్తం

అది 2006వ సంవత్సరం. బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తామని, అందు కోసం భూములను ఇస్తే వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కంపెనీలో షేర్లు కల్పిస్తామని ప్రభుత్వం ఆశచూపింది. ఇందుకు నిరాకరించిన రైతులను, వారికి అండగా నిలిచిన సిపిఎం నాయకులను అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడి రూ.కోట్ల విలువ చేసే భూములను కారు చౌకగా లాగేసుకుని జిందాల్ కంపెనీకి కట్టబెట్టింది. నేటికి 20ఏళ్లు కావస్తున్నా కంపెనీ ఏర్పాటు చేయలేదు. దీంతో, భూములను త్యాగం చేసిన రైతులు, వారి ఆధారంగా జీవనం సాగించే వృత్తిదారులు, కూలీలు పొట్టకూటికోసం రోజు సుదూర ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి దాపురించింది. కంపెనీ ఏర్పాటు చేయలేక పోయినందుకు చట్ట ప్రకారం తిరిగి భూములు తీసుకుని రైతులకు అప్పగించాల్సిన ప్రభుత్వం అదే భూమిపై మరింత హక్కును దఖలు పరుస్తూ ఈనెల 10న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయం చేయడం గమనార్హం. నాటి నుంచి నేటి వరకు మారిన ప్రభుత్వాలన్నీ ఆ కంపెనీకి వెన్నుదున్నుగా నిలబడడం తప్ప, భూములు కోల్పోయిన బాధితుల కోసం ఇసుమంత కూడా ఆలోచించకపోవడం గమనార్హం



భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)

ఎకరాకు రూ.3లక్షల చొప్పున క్యాపిటల్ సబ్సిడీ

మంత్రివర్గ నిర్ణయంతో జీవనాధారం కోల్పోయిన నిర్వాసితులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసేందుకు 2006లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి పంచాయతీల పరిధిలోని బొడ్డవర, లక్ష్మీపురం, అమ్మవలస, మొట్టవలస, చినఖండేపల్లి, ముషిడిపల్లి, కొత్త అడ్డతీగల తదితర గ్రామాల పరిధిలోని 1166.43 ఎకరాలను రైతులను నుంచి బలవంతంగా లాక్కుని జిందాల్‌కు అప్పగించింది. అప్పట్లో ఎకరాకు రూ.2.5లక్షల చొప్పున మాత్రమే పరిహారం ఇచ్చారు. నేడు ఈ ప్రాంతంలో ఎకరా రూ.కోటి నుంచి రూ.4కోట్ల వరకు మార్కెట్ విలువ పలుకుతోంది. కారు చౌకగా భూములు లాక్కోవడాన్ని అప్పట్లో నేటి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నాయకత్వంలో భూ నిర్వాసిత రైతులు పెద్దఎత్తున ప్రతిఘటించారు. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం తమ్మినేని సహా రైతులకు అండగా నిలబడిన ఇతర పార్టీ నాయకులను, నిర్వాసితులను కూడా అప్పట్లో అరెస్టులు చేసి, తప్పుడు కేసులు బనాయించింది. మరోవైపు బాక్సైట్ గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ అటు అరకు, అనంతగిరి ప్రాంతంలో కూడా సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పెద్దఎత్తున పోరాడారు. ఆ ప్రాంతంలో సర్వే చేపట్టేందుకు వచ్చిన అన్‌రాక్ కంపెనీ ప్రతినిధులను విల్లంబులతో వెంబడించారు. ఇటు నిర్వాసితులు, అటు గిరిజనులు సుమారు రెండేళ్లపాటు నిర్విరామంగా చేపట్టిన పోరాటంతో ప్రభుత్వం ఏకంగా బాక్సైట్ త్వకాలనే విరమించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో, కంపెనీ ఏర్పాటు సాధ్యం కాలేదు. ఇలా సేకరించిన భూమిలో ఐదేళ్లలోపు పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే చట్ట ప్రకారం తిరిగి భూమి యజమానులకు అప్పగించాలి. నాటి కాంగ్రెస్‌గానీ, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలు అందుకు భిన్నంగా వ్యవహరించాయి. వైసిపి ప్రభుత్వం ఈ భూమిలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామని ప్రకటించగా, నేటి కూటమి ప్రభుత్వం జిందాల్ ఆధ్వర్యాన ప్రైవేటు ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందుకు తగ్గట్టే ఈనెల 10న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్కు లిమిటెడ్ (ప్రైవేట్) పేరిట ఈ భూమిని బదలాయించింది. అంతే కాదు క్యాపిటల్ రాయితీ కింద ఎకరాకు రూ.3లక్షల చొప్పున రాయితీ కూడా ప్రకటించింది. దీనివల్ల ముందుగా చెప్పిన భారీ పరిశ్రమల స్థానంలో చిన్నచిన్న పరిశ్రమలు రావచ్చు. కానీ, ఇందులో నిర్వాసితులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరికే అవకాశం లేదు. షేర్లకు బదులు ఎకరాకు రూ.2.5లక్షలు చేతిలోపెట్టి చేతులు దులుపుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల నిర్వాసితులకు జిందాల్ కంపెనీ సెటిల్‌మెంట్లు మొదలుపెట్టింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి మాట్లాడడం లేదు. చాలా మంది దీన్ని వ్యతిరేకిస్తూ సెటిల్‌మెంట్లకు ముందుకు వెళ్లలేదు. మరోవైపు బాధితుల తరపున సిపిఎం, స్థానిక ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యాన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భూములను వెనక్కి తీసుకోవాల్సిన ప్రభుత్వం ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు పేరిట అదే జిందాల్ సంస్థకు కట్టబెట్టడం గమనార్హం.

మరోవైపు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. అప్పట్లో ఇచ్చిన పరిహారమే తక్కువ. అందులోనూ కొంతమంది నిర్వాసితులకు ఇచ్చిన చెక్కులను కూడా వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నవారికీ, అసైన్డ్ భూముల నిర్వాసితులకు పరిహారం పూర్తిగా ఇవ్వలేదు. ఒకప్పుడు రాజుల్లా బతికే రైతులు నేడు దినసరి కూలీలుగా మారారు. 'కంపెనీ లేదు ఉద్యోగాలూ లేవు. భూములు లాగేసుకుని మా పొట్టకొట్టారు.. ఇప్పటికైనా తిరిగి మా భూములు మాకు అప్పగించకపోతే బతికేందుకు ఆస్కారం లేదు' అంటూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆరికతోటలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

మౌలిక వసతులు మెరుగు పరచాలి

- రక్షిత తాగు నీరు అందుబాటులో ఉంచాలి
- ఆరికతోట, బాడంగి పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బాడంగి, రామభద్రపురం, దత్తిరాజేరు

పాఠశాలల్లో మౌలికవసతులు మెరుగు పర్చాలని కలెక్టర్ రామ సుందర్ రెడ్డి జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. మంగళవారం రామభద్రపురం మండలం ఆరికతోట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, బాడంగి మండలంలో కస్తూరిబా బాలిక విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరికతోట ఉన్నత పాఠశాలలో తరగతి గదులను సందర్శించారు. విద్యార్థులు ఏవిధంగా అభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలను పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను వండాలని సూచించారు. విద్యార్థులకు అందించే తాగునీటిని కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఆ నీటిని తాగారు. ఆర్ఒ ప్లాంట్ లేని పాఠశాలలో గ్రామీణ నీటి సరఫరా అధికారులచే ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయాల్సిన అవసరముందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న రాగిజావ పంపిణీ తనిఖీ చేసారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు.

బాడంగిలో కెజిబివిని సందర్శించి తరగతి గదుల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. వంటశాల, తాగు నీరు సదుపాయాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న బాలికల వసతి సముదాయాన్ని పరిశీలించి సకాలంలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. చిన్నారులకు అందుతున్న సదుపాయాలను తనిఖీ చేశారు. చిన్నారులతో ముచ్చటించి వారికి అందు తున్న సదుపాయాలను చూసి కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. స్టాక్ రికార్డు పరిశీలించారు . పిల్లలకు పెట్టిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి చెందారు. కలెక్టర్ వెంట డిఇఒ మాణిక్యాల నాయుడు ఉన్నారు.

అనధికార మద్యం కనపడకూడదు : కలెక్టర్

బెల్ట్ షాప్ నిర్వాహకుల పై నాన్ బెయిలబుల్ కేసులు : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సారా , అనధికార మద్యం రహిత జిల్లాగా విజయనగరం ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. బెల్ట్ షాప్‌లను కూడా గుర్తించి వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్, ఎస్‌పి కలసి అక్రమ మద్యం తయారీ, సరఫరాపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు గట్టి నిఘా ఉంచాలని, సరిహద్దు గ్రామాల్లో రైడ్స్ చేయాలని, తక్షణమే బెల్ట్ షాప్‌లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమమద్యంపై ఉక్కు పాదం మోపాలన్నారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ నాటు సారా తయారీలో వినియోగించే నల్ల బెల్లం విక్రయించే వారిని వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. నాటు సారాను తయారు చేసే వారెవరో తెలుసుకొని వారి పై నాన్ బెయిలబుల్ కేసు లు పెట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అబ్కారీ శాఖ అధికారి శ్రీనాధుడు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ చౌదరి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

దీపావళి పండగ నేపథ్యంలో విక్రయదారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. బాణసంచా పేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక విక్రయ షాపుల కోసం వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టేలా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే షాపులు ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.నిబంధనలను అతిక్రమించిన వారిపైన, జనావాసాల్లో బాణసంచాను భద్రపర్చిన వారిపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

కన్నుల పండువగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. తన పుట్టినిల్లైన పెద్దచెరువులో పైడిమాంబ హంస రూపంలోని పడవపై మూడుసార్లు విహరించి, భక్తులను ఆశీర్వదించారు. ఈ వేడుకను తిలకించి భక్తులు పులకరించారు. అంతకు ముందు అమ్మవారి వనం గుడి వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో వేదసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, పైడితల్లి అమ్మవారి ఆలయ సహాయ కమిషనర్ కె.శిరీష, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.



పెద్దచెరువులో సాగుతున్న తెప్పోత్సవం

విద్యుత్తు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈనెల 15 నుంచి విద్యుత్తు ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టివి రమణ తెలిపారు. విద్యుత్తు సంస్థ రక్షణ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, పెండింగ్ డిఎలు వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అర్హత ఉన్న ఉద్యోగులకు కన్వర్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తు ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు ప్రభుత్వంతో పాటు ఆ సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యుత్తు రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. విద్యుత్తు సంస్థల మనుగడకు, ఉద్యోగాలను కాపాడు కునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. సమ్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యోగులంతా ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలని కోరారు.

ఎంఎస్ఎంఇ పార్కుతో
మహనీయుడి ఆశయాలకు గండికొట్టొద్దు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎంఎస్ఎం పార్కుతో మహనీయుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు ఆశయాలకు గండికొట్ట వద్దని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ ప్రభుత్వాన్ని కోరారు. జిందాల్ నిర్వాసితుల పోరాటం 116 వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా నిర్వాసితులంతా గొర్రిపాటి ఫొటోతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జీవో నెంబర్ 14 రద్దుచేసి తాటిపూడి రిజర్వాయర్ నీరు సాగు తాగు కోసం మాత్రమే అంకితం చేసినప్పుడే బుచ్చి అప్పారావుకి ఘనమైన నివాళి అని అన్నారు. తాటిపూడి నీటిని రైతులకు కాకుండా పరిశ్రమకు కేటాయించడం గొర్రిపాటి బుచ్చి అప్పారావు స్ఫూర్తికి విరుద్ధమన్నారు తాటిపూడి రిజర్వాయర్ నీటిని ఇప్పటికే విశాఖపట్నం లో ఉన్న పరిశ్రమలకు అమ్ముకుంటున్నందున స్థానిక రైతాంగానికి నీటి ఇబ్బందులు ఎదురవుతునా న్నయన్నారు. తాటిపూడి నీటిని మళ్ళించకుండా ఇక్కడ ఎంఎస్ఎంఇ పార్కు రాకుండా చేసినప్పుడే బుచ్చి అప్పారావు గారి ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. ప్రభుత్వం తమ సాగునీటి, తాగునీటి హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేసారు. తమకు న్యాయం జరిగే వరకూ నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు.



బుచ్చి అప్పారావు చిత్రపటంతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

శరవేగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి : ఎమ్మెల్యే కళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో రానున్న జూన్, జూలై నాటికి అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధం కాబోతుందన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం మరో కొత్త మైలురాయి అన్నారు. విశాఖ ఒక సిలికాన్ వ్యాలీ అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు రుషికొండకు బోడిగుండు కొట్టిందన్నారు. గత ఐదేళ్లలో ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లిన జగన్మోహన్ రెడ్డి ఒక్క ఐటి కంపెనీ గాని, ఒక పరిశ్రమను గాని తీసుకురాగలిగారా అని ప్రశ్నించారు. ఇవి కాకుండా పలాసలో మరో ఎయిర్‌పోర్టు , అనకాపల్లి దగ్గరలో ఒక స్టీల్ ప్లాంట్ రాబోతుందన్నారు

విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు : బొత్స

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. 1966 అక్టోబర్ 15న విశాఖ ఉక్కు -ఆంధ్రులకు హక్కు ఉద్యమానికి 59 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత తాడికొండ మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృత రావు స్ఫూర్తిని కొనసాగించాలని, కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ రూపొందించిన కరపత్రాలను మంగళవారం బొత్స ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 విభాగాల ప్రైవేటీకరణకు టెండర్ పిలవడం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడమేనని అన్నారు. 32మంది ప్రాణత్యాగం చేసిన అమరవీరులను విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ద్వారా కూటమి ప్రభుత్వం అవమాన పరుస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి, ప్రతినిధులు పిడకల ప్రభాకర్ రావు,ధారాన వెంకటేష్, డోల కోటేశ్వరరావు, వైసిపి ఎస్‌సి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు , జామి కృష్ణ, చంద ఉమామహేశ్వరరావు, వంక చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివి విసికి 'సీతం' డైరెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డాక్టర్ వి.వి సుబ్బారావుకు సీతం కళాశాల డైరెక్టర్, జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మంగళవారం దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అనుబంధ కళాశాలల సహాయ సహకారాలతో విశ్వవిద్యాలయాన్ని మరింత ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, సీతం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టిడివిఎ నాయుడు పాల్గొన్నారు.



విసిని సత్కరిస్తున్న సీతం డైరెక్టర్‌డాక్టర్ శశిభూషణరావు

బూత్ స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలని డిఆర్ఒ శ్రీనివాస మూర్తి తెలిపారు. బిఎల్‌ఎల ఫోటోలను, మొబైల్ నెంబర్లను సంబంధిత ఇఆర్ఒకు అందజేయాలని అన్నారు. మంగళవారం తన ఛాంబర్లో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల సవరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటర్ల జాబితా లో చేర్పులు, తొలగింపులు, మార్పులను ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో తనిఖీ చేయవచ్చునని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను కూడా తనిఖీ చేయ వచ్చునని స్పష్టం చేశారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం 6.1.2025 నాటికి జిల్లాలో 7 నియోజకవర్గాలలో 15,66,438 మంది ఓటర్లు ఉండగా 7913 మంది చేర్పులు, 2924 మంది తొలగింపులు, 4920 మంది మార్పులు చేసిన తర్వాత నేడు 15,71,427మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమావేశంలో బిజెపి, బిఎస్‌పి, ఐఎన్‌సి వైసిపికి చెందిన ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షకులు భాస్కరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయరు మృతి

ప్రజాశక్తి-డెంకాడ

భోగాపురం మండల సర్వేయరుగా పనిచేస్తున్న మధుకేశ్వరరావు (53) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విధులు ముగించుకొని భోగాపురం నుంచి విజయనగరం వస్తుండగా పెదతాడివాడ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడంతో ఆయన గాయపడ్డారు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకునేందుకు వైసిపి చేపట్టే ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 24 వరకు జరిగే వివిధ కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోరాటంలో పార్టీ నాయకులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి, నగర ప్రెసిడెంట్ ఆశపు వేణు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌విఎస్ రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, మండల అధ్యక్షులు కెల్ల త్రినాధ్, డివిజన్ల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

బ్రిడ్జి మంజూరుకు మంత్రి ఆదేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు అడ్డంకిగా మారి ప్రమాదాలకు గురిచేస్తున్న కాజ్ వే స్థానంలో బ్రిడ్జి శాంక్షన్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసర నివేదిక పంపాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని ఆదేశించారు. విజయనగరం నుంచి కరకవలస, చంద్రంపేట మీదుగా బొడ్డవర వెళ్లే మార్గంలో చంద్రంపేట గడ్డ వద్ద ఉన్న కాజ్‌వేపై వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రమాదాలకు కారణమవుతుందని, ఆ కాజ్ వే స్థానంలో తక్షణం బ్రిడ్జి నిర్మాణం కోసం తక్షణం శాంక్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టరును కోరారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరుకు వ్రాసిన లేఖను మంత్రి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు జిల్లా కలెక్టరు కు అందజేశారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ర్యాలీ

ప్రజాశక్తి -కంటోన్మెంట్

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్ జీవనరాణి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల ప్రాముఖ్యత, భవిష్యత్ ప్రణాళిక గురించి వివరించారు. ముందుగా ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీని డిఎంహెచ్ఒ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టీకా నియంత్రణ అధికారి ఆర్. అచ్చుతకుమారి, పిఒయన్. సిడివివి బి సుబ్రమణ్యం, డెమో వి. చిన్నతల్లి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యం. చాముండేశ్వరి ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

గూగుల్ రాకతో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఐటి హబ్‌గా విశాఖను అభివృద్ధి చేసేందుకు గూగుల్‌సంస్థ ఏర్పాటవుతున్న నేపథ్యంలో టిడిపి ఆధ్వర్యాన మంగళవారంరాత్రి టిడిపి నాయకులు అశోక్‌బంగ్లా వద్ద బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేశారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆధ్వర్యంలోజరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గూగుల్ సంస్థ విశాఖలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ ప్రధానమంత్రి తో కలిసి ఒప్పందం చేయడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ గూగుల్ సంస్థ రావడంతో అభినందనీయ మన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటి హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, కార్యదర్శి పాశి అప్పలనాయుడు, పార్లమెంట్‌స్థానం మహిళా అధ్యక్షులు అనురాధా భేగం పాల్గొన్నారు.



బాణాసంచా కాలుస్తున్న టిడిపి నాయకులు

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో ప్రైవేట్ బ్యాంకు యజమానులు ఆయా బ్యాంకు ఉద్యోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై ఆలిండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్, స్టేట్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఆయా ప్రైవేటు బ్యాంకుల వద్ద నిరసన తెలిపారు. నగరంలోని లయిన్స్‌క్లబ్ వద్ద గల ఫెడరల్ బ్యాంక్ బ్రాంచి వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు బివి ప్రసాద్, సెక్రటరీ మురళీ శ్రీనివాస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ నాయకులు మురళి, ఫెడరల్ బ్యాంక్ నాయకులు విష్ణు, కెవిబి బ్యాంక్ నాయకులు శర్మ , నాగభూషణరావు, అశోక్ నాయక్, హరి , మనోజ్ వర్మ, పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాలు పెట్టాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

అన్న క్యాంటిన్‌లో నాణ్యమైన భోజనాలు పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి కోరారు. స్థానిక అన్న క్యాంటిన్‌ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనంలో అన్నం గట్టిగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అన్నం మెత్తగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. భోజనాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంటిన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమెతో శానిటరీ సిబ్బంది ఉన్నారు.

మొక్క జొన్న పై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మొక్క జొన్న పంటపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎ.ఒ. యం.శ్యాంసుందర్ రైతులకు సూచించారు. మంగళవారం మెట్టవలస గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్న రైతులు పంటను కోసి వాటి నూర్పిడి పనులలో బిజీగా ఉన్నారని వాతావరణ శాఖ సూచనలు ప్రకారం రాబోయే రెండు మూడు రోజులు కూడా అక్కడక్కడ సాధారణ నుంచి భారీ వర్షాలు పడడానికి అవకాశం ఉందని మొక్కజొన్న రైతులు పంట కోసిన వెంటనే వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసిన కండెలకు మొక్క మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. వరి పంటపై ప్రస్తుత పరిస్థితిలో గోడ తెగులు దోమ వంటి వాటి నుండి రక్షణకు తీసుకోవలసిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని పెద్దవీధిలో ఉన్న శివాలయం దగ్గర నుండి కేదారేశ్వర గుడి వరకు ఉన్న డబ్ల్యూబిఎం రోడ్డు పనులు పూర్తి చేయించాలని వార్డ్ సభ్యుడు చిప్పాడ శేషగిరి స్థానిక రైతులతో కలిసి ఎంపిడిఒ సతీష్‌కి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో ఈ రోడ్డు పనులను ప్రారంభించి కాంట్రాక్టర్ కొంత పని మాత్రమే చేసి అర్ధాంతరంగా ఆపివేశారన్నారు. రూ.35 లక్షలు వర్కు ఉండగా కేవలం రూ.5 లక్షలు పైచిలుకు మాత్రమే వర్క్ చేసి వదిలివేశారన్నారు. దీంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

సి పి ఐ లిబరేషన్ పార్టీ పిలుపు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ విజయనగరం జిల్లా కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ శంకర్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాధ్యులు కామ్రేడ్ బొడ్డు వాసుదేవరావు జిల్లా కమిటీ ప్రచురించిన మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర మహాసభల ఉద్దేశాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజల వద్దకు తీసుకెళ్ళి విస్తత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ నెలల్లో కడప జిల్లాలో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ అప్పలరాజు, సత్యారావు, పైడిరాజు, గిరిప్రసాద్, సన్యాసి రావు, గౌతమి పాల్గొన్నారు.

చంద్రబాబు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి హయాంలో టిటిడి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని తప్పుడు కేసులు పెట్టిన సిఎం చంద్రబాబు రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ..టిటిడి లడ్డూకు కల్తీ నెయ్యి వాడారని కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడితే ఆధారాలు లేక సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. రాష్ట్రంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెట్టి మద్యాన్ని అమ్ముతున్నారని విమర్శించారు. కల్తీ మద్యాన్ని నియంత్రించాలని, బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ, నాయకులు శంబంగి వేణుగోపాల్ పాల్గొన్నారు..



శ్రమదానం చేస్తున్న వాకర్స్

వాకర్స్‌క్లబ్ శ్రమదానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవార 42వ డివిజన్ పరిధిలో.. అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో శ్రమదానం చేశారు. క్లబ్ గౌరవ అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, డాక్టర్ ఎ. ఎస్. ప్రకాశరావు మాష్టారు పర్యవేక్షణలో క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, త్యాడ రామకష్ణారావు (బాలు) ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా శ్రమదాన కార్యక్రమంలో పాల్గున్న ప్రముఖ సాహితీవేత్త, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ డి.వి.జి. శంకరరావు మాట్లాడుతూ మన పరిసరాల్లోనైనా, ఇటువంటి నిత్యం తిరిగే ఆరోగ్యకరమైన నడకమైదానంలో ఇటువంటి స్వచ్ భారత్, శ్రమదాన సేవాకార్యక్రమాలు చేపడితే ప్రజల ఆరోగ్యానికి మంచిదని అన్నారు. పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు తరుచూ చేబడుతున్న శ్రీ సాయి కష్ణా వాకర్స్ క్లబ్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పెద్దలు జి. గోవిందరావు,వై. నల్లమరాజు, కోట్ల ఈశ్వరరావు,త్యాడ ప్రసాద్ పట్నాయక్, పెనుమత్స అప్పలరాజు,ఇందుకూరి అప్పలరాజు, టి.రమణ,అప్పారావు మాష్టారు,బడి కష్ణమూర్తి, నరేష్ తదితరులు పాల్గున్నారు.

గవాయ్‌పై దాడి దారుణం

ప్రజాశక్తి- గంట్యాడ



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటితో దాడి చేయడం దారుణమని సిపిఎం మండల కన్వీనర్ రాకోటి రాములు అన్నారు. మండలంలోని లోతుగెడ్డలో మంగళవారం దాడికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ కృష్ణవేణి, రాములమ్మ, పావని, సింహాచలం, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు బాగులేకే ప్రభుత్వానికి చెడ్డ పేరు

మండల సర్వసభ సమావేశంలో ఎంఎంసి చైర్మన్ కళావతి

సమస్యలపై అధికారులను నిలదీసిన ఎంపిపి, సభ్యులు

ప్రజాశక్తి - కురుపాం



ఐటిడిఎ ఎఇను సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిపి

మండలంలో అధికారుల పనితీరు బాగో లేకపోవడం వల్లే కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగిన సర్వసభ సమావేశానికి ఎఎంసి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఐటిడిఎ ఎఇ అప్పారావు మాట్లాడుతున్న సమయంలో పలువురు సర్పంచులు గిరి శిఖర గ్రామాల్లో ఎప్పుడో రోడ్డు పనులు ప్రారంభించి నేటికీ పూర్తి చేయకపోవడంతో కనీసం గిరిజన ప్రజలు రాకపోకలకు వీలు లేకుండా ఉందని, ఇప్పటికైనా రోడ్లు పూర్తిచేసి ప్రజల రాకపోకలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. శివన్నపేట ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు మాట్లాడుతూ ఏడాది క్రితం చేసిన పనులకు నేటికీ బిల్లులు చేయకపోతే ఎలా ప్రశ్నించారు. గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోడ్లన్నీ ఒక్క కాంట్రాక్ట్‌కే ఇచ్చిన నేపథ్యంలో ఎక్కడా పని పూర్తి చేయకుండా కొబ్బరికాయ కొట్టి విడిచి పెట్టారని, దీంతో బురద రోడ్లపైనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. కావున తక్షణమే రహదారి నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మొండెంఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్ మాట్లాడుతూ తమ పంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు కనీసం సర్పంచ్‌కు తెలియకుండా అధికారులు కూటమి నాయకులతో పనులు చేపట్టడం సమంజసం కాదన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉండటంతో సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తును నిరంతరం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పనిలో చేపట్టిన గోకులం షెడ్ల బిల్లులు, లబ్ధిదారుల వేతనాలు త్వరితగతినపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కోరారు. అనంతరం ఎంపిపి పద్మావతి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎఎంసి చైర్మన్ కళావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలు అభివృద్ధి జరిపిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతుంటే గ్రామస్థాయి కొచ్చేసరికి అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం వల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఇప్పటికైనా సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులు రాసుకొని పరిష్కారమయ్యేలా చర్యలు పట్టాలని కోంరు. వారి సమక్షంలో లేనివైతే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయ, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, వివిధ శాఖల మండల అధికారులు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ భర్త

సమావేశంలో డమ్మీ ప్రజాప్రతినిధులు హల్‌చల్

సర్వసభ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండీ సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురావాలి. కానీ కురుపాం సర్వసభ సమావేశంలో వింత పోకడగా కొనసాగుతుంది. మంగళవారం జరిగిన సర్వసభ సమావేశంలో ఉదయపురం సర్పంచ్ బి.అరుణకు బదులుగా ఆమె భర్త సమస్యలపై అధికారులను నిలదీశారు. అలాగే తిత్తిరి సర్పంచ్ బి.గౌరికి బదులుగా ఆమె కుమారుడు సమస్యలపై అధికారులకు నిలదీశారు. అంతేకాకుండా చాలామంది ప్రజాప్రతినిధులకు బదులుగా వారి బంధువులు, మాజీ ప్రజాప్రతినిధులు కూడా సమావేశంలో కూర్చుండడంతో నియంత్రించాల్సిన అధికారి చోద్యం చూస్తుండడంతో పలువురు మండల అధికారులు ఆశ్చర్యార్థకంగా చూసి తప్పనిసరి పరిస్థితుల్లో సమాధానం చెప్పాల్సి వచ్చింది.



దుకాణదారునికి నోటీసు అందజేస్తున్న శానిటేషన్ సిబ్బంది

వాయు కాలుష్యంపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

వాయు కాలుష్య నియంత్రణపై స్థానిక మున్సిపాల్టీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని 15 వాణిజ్య సంస్థలకు (స్వీట్స్, బేకరీలు, హోటల్స్, ఖార్కానాలు) మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం 'క్లీనర్ ఎయిర్' (పరిశుభ్రమైన గాలి) లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ ఆదేశాల మేరకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో గల బేకరీలు స్వీట్ షాపులు కార్కానాలను తనిఖీలు చేసి 15 షాపులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీట్ షాపులు బేకరీ షాపులు కార్కానాల ద్వారా బయటకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులకు గురై తీవ్ర ఆరోగ్య సమస్యలు పాలవుతున్నారని అన్నారు. తినుబండారాలు తయారు చేయడానికి ఈ సంస్థలు వినియోగిస్తున్న రంపం పొట్టు, ఊక, కర్రల పొయ్యిల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ కారణంగా పట్టణంలో వాయు కాలుష్యం తీవ్రమవుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, ముఖ్యంగా టిబి, శ్వాసకోశ వ్యాధులు వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని అయన తెలిపారు. వాయు కాలుష్యాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా ఈ 15 దుకాణాలను గుర్తించి, పర్యావరణ కార్యదర్శులు (సెక్రెటరీ)ల ద్వారా వారికి నేరుగా నోటీసులు అందజేశామని తెలిపారు. మున్సిపల్ ఆదేశాల ప్రకారం నోటీసులు అందిన 24 గంటల్లోగా తమ సమాధానాన్ని మున్సిపాల్టీకి లిఖిత పూర్వకంగా సమర్పించాలని, నోటీసు అందిన వారం రోజుల్లోపు కాలుష్యానికి కారణమవుతున్న రంపం పొట్టు, ఊక, కర్రల పొయ్యిలను పూర్తిగా తొలగించాలని, తమ వ్యాపారాలకు ఇకపై గ్యాస్ పొయ్యిలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. మున్సిపాల్టీ జారీ చేసిన ఈ ఆదేశాలను ఏ ఒక్కరూ ధిక్కరించినా, వారి వ్యాపార లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం, పేరెంట్స్ అసోసియేషన్, ఐలూ, కాంగ్రెస్, ఏపీ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలకు పాలకులు అధికారులు విలువివ్వాలని, గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను పరిహారం చెల్లించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకుని గిరిజన విద్యార్థుల మరణాలు నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, ద పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వారణాసి శ్రీహరి, చుక్క చంద్రరావు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇవి నాయిడు, కాంగ్రెస్ నాయకులు తీల్ల గౌరీశంకర్ రావు, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలూ) జిల్లా అధ్యక్షులు ఎంవి రమణ, గిరిజన సంక్షేమ నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు అల్లు చందు, గౌరీశ్వరి, రజిని, అమల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు లక్ష్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో వాలంటీర్లు లక్ష్యాలను అధిగమించాలని ఎంపిపి ఉరిటి రామారావు ప్రకటించారు. మండల కేంద్రంలోని వెలుగు, ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో రెండో విడత ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన వాలంటీర్లకు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపిపి అన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని కోరారు. వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే వాలంటీర్లకు ముందుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రచురించబడే పుస్తకాలు సరఫరా చేస్తున్నామని, ఇందులోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని హితవు పలికారు. 15 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను నియమిస్తున్నామన్నారు. ఎంపిడిఒ జి.పైడితల్లి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన సమయంలోగా చదువు చెప్పాలన్నారు. లక్ష్యాలు సాధించి, మండలానికి మంచి పేరు తీసుకు రావాలని ఆమె కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు బాణాల సురేష్, అక్కేన రామకష్ణ, ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సీసీలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వడిశాపు లక్ష్మణరావు, టి.చంద్ర మోహన్, కోటిపల్లి దాసు, ఉడమల శాంతికుమారి, వివఎలు, పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి ఉరిటి రామారావు

గుమ్మలక్ష్మీపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని వాలంటీర్లు జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎల్. శ్రీనివాసరావు కోరారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో మొదటి రోజు వెలుగు -డిఆర్‌డిఎ, ఉపాధిహామీ వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం సతీష్ ఉన్నారు. అలాగే జియమ్మ మండలంలోని 31 పంచాయతీలో ఉన్న వయోజనులైన నిరక్షరాస్యలకు విద్యను అందించేందుకు, వారికి విద్యాబోధన చేసేందుకు వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడిఒ ధర్మారావు తెలిపారు. ఎలా విద్యాబోధన చేయాలో అవసరమైన మెటీరియల్ అందించమన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ఎక్కడ?

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. కొన్నింటిని మాత్రమే పరిష్కరించి మిగతా వాటికి పరిష్కార వేదిక చూపలేదు. ప్రతి సమావేశంలో ఎన్నో సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ హామీలే తప్ప ఆచరణలో కానరావడం లేదు. మొక్కుబడిగా సమావేశాలతో ఎటువంటి ప్రయోజనంలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మరోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. మండలంలోని ఇరిడి ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం నిర్మించి విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా చూడాలని సభలో ప్రస్తావించినప్పటికీ నేటికీ పరిష్కారం చూపలేదు. దీంతో ఇటీవల తుఫానుకు తాత్కాలిక రేకుల షెడ్ నీట మునిగిందని చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ తెలిపారు. గిరి శిఖర గ్రామాలకు రోడ్లు వేసి డోలిమోతల నుంచి గిరిజనులకు విముక్తి కల్పించాలని కోరినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజనులకు నేటికీ కాలిబాట తప్పడం లేదు. వైద్యం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు పండిస్తున్న ఆహార, వాణిజ్య వరి, జీడి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని ఎన్నోసార్లు ప్రస్తావించినా కనీసం పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నేటికీ వెంటాడుతుంది. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించి స్థానికంగా విద్యార్థులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గత సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినా నేటికీ నియామక చర్యలు కాన రాలేదు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా, మలుపుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే చర్యలు చేపట్టాలని ప్రస్తావించినప్పటికీ కనీసం స్పందించలేదు. ఇలా గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కారమైతే ప్రస్తుత సమావేశాలకు ప్రాధాన్యత ఉంటుందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.



ఫిల్లర్లకే పరిమితమైన ఇరిడి పాఠశాల

తొలగింపు ఆలోచన మానుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ శాఖ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగింపు ఆలోచన మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసిందని, కూటమి ప్రభుత్వం మాత్రం వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల తొలగింపు ఆలోచన మానుకోవాలని, యధావిధిగా కొనసాగించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే జిఒ 3 లేకుండా డిఎస్సీ నిర్వహించి గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువతకు టీచర్ ఉద్యోగాలు రాకుండా చేశారని రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పుపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పివి.ఇతమానుగూడ పంచాయతీ పరిధిలో డొంబంగివలసలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వాతావరణం మార్పు - ప్రభావాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరావు, గ్రీన్ హౌస్ అంటే ఏమిటి? గ్రీన్ హౌస్ ఉపయోగాలు, వాతావరణం మార్పు వల్ల కలిగే ప్రభావాలు కోసం, అడవి పెంచడం వల్ల కలిగే లాభాలు వివరించారు. అడవిలో దుంపలు, ఆకుకూరలు, మందులు ఉపయోగా లు, చిరుధాన్యాలైన కొర్ర, సామ, రాగుల ఉపయోగాలు, పంట దిగుబడి పెంచేందుకు మెళకువలు, జీడీ ప్లనింగ్ వల్ల ఉపయోగాలు, వరి లైన్ షోయింగ్, శ్రీవరి, వరి, జమున మోడల్, గులిరాగి, వాటి ఉపయోగాలు గురించి వివరించారు. అలాగే పురుగు మందులు బదులుగా నీమస్త్రం, జిల్లేడు ద్రావణం, పంచపత్ర కాషాయం, వేప నూనె ఉపయోగించాలని, రసాయనిక మందులు బదులుగా ఘన, ద్రవజీవామృతాలు, గోకృపామతం ఉపయోగించి మంచి పంటను పొంది ఆరోగ్యం పెంచుకోవాలని వివరించారు. రైతులకు ఉపాధి పనుల ద్వారా మిశ్రమ తోటలను పెంచి, వ్యవసాయానికి ఉపయోగించి గట్లుపై కూరగాయలు, పండ్లు మొక్కలు, వేసి ఆర్థికంగా వేదగాలని, మన ప్రాంతంలో ఉన్న గ్రామాలు బయో గ్రామాలుగా మార్చేందుకు రైతులంతా సహకరించాలని తెలిపారు. ఈ శిక్షణకు సలభంపాడు, నెలిగండి, ఎగువ,దిగువ డొంబంగివలస గ్రామాల నుంచి 42 మంది రైతులు పాల్గొన్నారు. వెలుగు అసోసియేషన్ నుంచి బి.రామయ్య సిసి, వెలుగు సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కొత్తగా ప్రవేశపెట్టిన ఎపి ఎక్సైజ్ సురక్ష వ్యాన్‌ను ప్రజలు డౌన్లోడ్ చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ పి.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ యాప్ ద్వారా లైసెన్స్ షాపుల్లో మద్యం బాటిళ్లను ఇ వ్యాపార స్కాన్ చేసుకొని నాణ్యతను తనిఖీ చేసుకోవచ్చున్నారు. షాపు యజమానులు చట్టంలో గల నియమ, నిబంధనలను పాటించాలని, మద్యాన్ని ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని అన్నారు. ఎక్కడైనా గొలుసు దుకాణాలు గాని, పరుగు రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం గానీ, నాటు సారా ఉంటే 9494902373 ఫోన్ నెంబర్‌కు తెలపాని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని హెచ్చరించారు.

120 లీటర్ల నాటుసారా స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కురుపాం

120 లీటర్ల నాటు సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని జియ్యమవలస మండలంలో తాళ్ళుడుమ్మా, అల్లువాడ గ్రామాల పరిధిలో నాటుసారా అమ్మకాలు నిరోధించే ఉద్దేశ్యంతో మంగళవారం దాడులు నిర్వహించగా 120 లీటర్లు నాటు సారా, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చినమేరంగికి చెందిన వెలగాడ చందు, బొమ్మాళి నవీన్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వీరిద్దర్ని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పది లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తకోట సమీపంలో సూర్యనారాయణ 10 లీటర్లు సారా తెస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. సూర్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు.

గెడ్డలో పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని చంద్రంపేట ఆరవసంత గెడ్డ వాగులోని సోమవారం రాత్రి విజ్జపు సోమరాజు (55) పడి గల్లంతయ్యాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకపోవడంతో పలుచోట్ల వెతికి బంధువుల ఇళ్లల్లో కూడా వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో గెడ్డలోని కొట్టుకుపోయి ఉంటాడని ఉద్దేశంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటలు తర్వాత స్థానికులు గెడ్డలో మునిగి ఉన్న మోపెడ్ బండిని గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గంట్యాడ తహశీల్దార్ నీలకంఠశివ రెడ్డికి గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, ఎంపిడిఒ రమణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని ఎపి ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినీ ఫలితం లేకపోయింది. విఆర్ఒ రవి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలుపుదల చేశారు.

నేరాలు ఘోరాలు

వ్యాన్ క్యాబిన్లో చిక్కుకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా వ్యాన్ క్యాబిన్లో చిక్కుకొని డ్రైవర్ పెనుమాక రాజు (36) మంగళవారం మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కు చెందిన ఈయన గోనెసంచులు పట్టుకొని ఐచర్ వ్యాన్ వీరఘట్టం వచ్చారు. కొత్తకోట వెంకటరమణ షాపులో దించాల్సిన గోనె సంచులను అన్లోడ్ చేసేందుకు వీలుగా కట్లు విప్పుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి క్యాబిన్లో పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని ప్రాణాపాయం లేకుండా తీసేందుకు ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికులు సహకారంతో ఆయన్ని స్థానిక చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.

మెట్ల నుంచి జారిపడి విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - మక్కువ



గాయపడ్డ విద్యార్థి భార్గవ్

ఎస్ ఎన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న కొవ్వాడ భార్గవ్, చైతన్య మంగళవారం స్కూల్ మెట్లు దిగుతుండగా జారిపడడంతో గాయాల పాయలయ్యారు. భార్గవకు చేయి దెబ్బతినగా, చైతన్య తలకు గాయమైంది. దీంతో వీరిని స్థానిక పిహెచ్‌సిలో చికిత్స అందించినట్లు హెచ్ఎం సంఘం తెలిపారు. పాఠశాల విడిచి పెట్టే సమయంలో పై అంతస్తులో చదువుతున్న విద్యార్థులు పరీక్షల అనంతరం మూకమ్మడిగా ఒక్కసారి మొదటి అంతస్తు నుంచి దిగుతుండగా మెట్లపై నుండి జారిపడినట్లు తెలిసింది.

పట్టణంలోచోరీ

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని రాజాం రోడ్‌లో అన్నవరం వద్ద షిర్డీ సాయిబాబా ఆలయం దగ్గర ఉన్న ఐరన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కె.గణేష్‌కు చెందిన ఈ షాపు తాళాలు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో ఆయన మంగళవారం ఉదయం వచ్చి సరికి రూ.2,50,000 విలువైన వస్తువులు పోయినట్లు గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ప్రయోగమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి : ఎపిటిఎఫ్

విజయనగరం టౌన్ : దేశంలో ఏ ఉద్యోగికి లేకుండా ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగోన్నతి అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నవంబర్ 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమం నిర్వహించాలని 'అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య' ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన జరిగిన అత్యవసర గూగుల్ మీట్ సమావేశం లో 25 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని చర్చించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని ఏపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు ఎస్. భాస్కర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రమణ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాలంటీర్లను కొనసాగించే వరకు ఉద్యమం

ఎపి వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి గౌరవ వేతనం 10వేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వాలంటీర్లను మోసం చేశారని, ఎన్నికల వాగ్దానాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలని ఎపి వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. స్థానిక అమర్ భవన్ లో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన జిల్లా వాలంటీర్ల సమావేశానికి హాజరైన పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 2 లక్షల 60 వేల మంది వాలంటీర్లకు న్యాయం చేస్తామని ఉగాది పండుగ సందర్భంగా తీపి కబురు అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 18 నెలల గడుస్తున్న వాలంటీర్లకు గౌరవ వేతనం బకాయిలు చెల్లించలేదని అన్నారు. వాలంటీర్ల సమస్యలపై మండలాల వారీగా వాలంటీర్లను ఐక్యత చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జడ యుగంధర్, సహాయ కార్యదర్శి కోన శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామజ్యోతి

విజయనగరం కోట : తెలుగు మహిళా పట్టణ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బంగారి రామజ్యోతి నియమితులయ్యారు. ఎన్నో ఏళ్లుగా టిడిపిలో క్రమశిక్షణతో ఉంటూ పార్టీ అధిష్టానం మన్ననలు అందుకున్న రామజ్యోతికి ఎట్టకేలకు పదవి వరించింది. ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు వితరణ

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాలు, పండ్లు, బిస్కెట్లు, కూల్ డ్రిక్స్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన మండల త్రినాధరావు కుటుంబ సభ్యులు తమ అల్లుడు పతివాడ సూర్యనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడి సెంటర్ల పిల్లలకు ఈ వితరణ అందజేశారు. వీటిని గ్రామ సర్పంచ్ లంక లక్ష్మణరావు చేతులు మీదుగా పిల్లలకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు, వితరణ చేసిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాటూరులో మొక్కలు నాటే కార్యక్రమం

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కోనం, రాజు చెరువును ఆనుకొని ఉన్న గట్టుపై మొత్తం 100 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొట్యాడ రమణమూర్తి, రుద్ర వెంకటరమణ, ముమ్మనా అప్పలనాయుడు పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు.

పరీక్షలు పరిశీలన

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హిందీ, ఇంగ్లీష్ పరీక్షలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు, హెచ్‌ఎం బిపిఎ రాజు పరిశీలించారు. అనంతరం ఎండిఎం పరిశీలన చేసి మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

హత్యారోపణలపై పరిశీలన

చీపురుపల్లి: మండలంలోని పుర్రేయవలస సమీపంలో నేలబావిలో ఈ నెల 9న శవమై తేలిన ఎలకల రాము (26) అనే యువకుడి మరణం పైన వారి తల్లిదండ్రులు బంధువులు వ్యక్తపరుస్తున్న అనుమానాలపై సమగ్ర పరిశీలన జరుపుతున్నామని ఎస్ఐ దామోదర్‌రావు వివరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ కుమారుడిది సహజ మరణం కాదని యమజానే హత్య చేసి ఉంటారని చేసిన ఆరోపణలు నేపథ్యంలో ఆ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తిస్థాయి పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు

రేగిడి: మండలంలోని లక్ష్మంపురం గ్రామంలో పశుగర్భకోశ వ్యాధి చికిత్సలను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఘనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆడ దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డిఎల్‌డిఎ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్య ప్రకాష్, జయ ప్రకాష్ పరిశీలించారు. రేగిడి పశువైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, రాము పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులకు చూడి కట్టడం, ఎదకు రావడం, గర్భకోస వ్యాధులు చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. 89 పశువులకు వైద్య తనిఖీలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విఒఎ సంఘం నూతన కమిటీ ఏర్పాటు

బాడంగి: మండలంలోని వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం మండల నూతన కమిటీ (సిఐటియు అనుబంధం) ని 8 మందితో ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్ ఏ.సురేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలుగు గ్రామ సేవకులుగా పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలన్నారు. విఒఎలకు పని ఒత్తిడి తీవ్రంగా ఉందన్నారు. దీని వల్ల అనారోగ్యాలకు గుర వుతున్నారని, పని ఒత్తిడి తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కొంతమంది విఒఎలకు బకాయి ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

గంట్యాడ: మండలంలోని గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సెంటర్ హెల్త్ టీమ్ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీమ్ ప్రతినిధి డాక్టర్ వరుణ్ విజయ్ ఆసుపత్రికి సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సిబ్బందిని పలు విషయాలపై ఆరా తీశారు, టీబీ, మలేరియా ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అధికారి రాణి, మలేరియా అధికారి మనీ, గంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.హేమలత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సందర్శన

భోగాపురం: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించి, సిఐ, ఎస్ఐలతో నేరాలపై సమీక్ష జరిపారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం విక్రయ కేంద్రాల్లో నాణ్యతను కాపాడే దిశగా ఎప్పటికప్పుడు దుకాణాల తనిఖీలు నిర్వహించాలని, షాపులలో నుంచి సాంపిల్స్ సేకరించి విశాఖపట్నం రీజనల్ లేబరోటరీకి పంపాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద ప్రదేశాల్లో దాడులు నిర్వహించాలని, వాహనాల తనిఖీలు, రూట్‌వాచ్‌లు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భోగాపురం ఎక్సైజ్ సిఐ వి. రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లక్కవరపుకోటలోని ఏపి మోడల్ స్కూల్లో ఈనెల 17, 18 తేదీలలో మండల స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల క్రీడా కోర్డినేటర్ పోలుపర్తి వెంకటరావు మంగళవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఎల్‌కోట మండల క్రీడా ఆర్గనైజింగ్ కార్యదర్శి, చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఈ ఆటల పోటీలకు 6 నుండి 10 వతరగతి వరకు చదువుతు విద్యార్థులు అర్హులన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని 17న బాలికలకు 18వ తేదీన బాలురుకు వేర్వేరుగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, వెంకటరమణ, గాడి రవి పాల్గొన్నారు.

రాజకీయ బ్రోకర్లు విమర్శలు చేస్తే ఎలా?

◆ బడ్డుకొండపై తప్పుడు ఆరోపణలు చేస్తే మర్యాదగా ఉండదు ◆ జనసేన నాయకులపై విరుచుకుపడ్డ వైసిపి నాయకులు

ప్రజాశక్తి- డెంకాడ

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై తప్పుడు ఆరోపణలు చేస్తే మర్యాదగా ఉండదని, రాజకీయ బ్రోకర్లు కూడా విమర్శలు చేస్తే ఎలా అని వైసిపి నాయకులు జనసేన నాయకులపై మండి పడ్డారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో సర్పంచ్ లంక లక్ష్మణరావు స్వగృహం వద్ద మంగళవారం వైసిపి మండల అధ్యక్షుడు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు వైసిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినాయుడు మాట్లాడుతూ ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు మరి కొంతమంది జనసేన నాయకులతో కలిసి భోగాపురంలో ఇటీవల విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై తప్పుడు ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త ఇటీవల నియోజకవర్గంలోని విలేకర్లందరినీ పిలిచి బెదిరించడంతో పాటు మాజీ ఎమ్మెల్యేపై కూడా విమర్శలు చేయడంతోనే బడ్డుకొండ అప్పలనాయుడు పత్రిక విలేకరులను భయభ్రాంతులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని సూచించారన్నారు. దీనికి జనసేన నాయకులు బడ్డుకొండపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఆరోపణలు చేసిన జనసేన నాయకులందరూ బడ్డుకొండ అప్పలనాయుడు దయాదాక్షిణ్యాలపై పదవులు అనుభవిస్తున్నారని ఆయన వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నారని ముందు ఆ పదవులు రాజీనామా చేసి ఆరోపణ చేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు పదుసార్లు పార్టీలు మారి రాజకీయ బ్రోకర్ ఇజం చేసే లబ్ది పొందుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు వైసిపిలో ఉంటూ జనసేన నాయకుల వద్ద ఎంత డబ్బులు తీసుకుని అమ్ముడుపోయారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా వైసిపి కార్యవర్గ సభ్యులు లంక లక్ష్మణరావు, బుగత రమణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కోరాడ కోటి నాయుడు, మోపాడు సర్పంచ్ ప్రతినిధి బడ్డుకొండ రమేష్ నాయుడు, గుణుపూర్ పేట వైస్ సర్పంచ్ బడుకొండ చిన్న, బడు కొండ రామునాయుడు, శంకర్ ప్రసాద్, మండల సత్యం పాల్గొన్నారు.

చవకబారు విమర్శలు మానుకోవాలి

పూసపాటిరేగ: జనసేన నాయకులు మాజీ ఎమ్మెల్యే బొడ్డుకొండ అప్పలనాయుడుపై చవకబారు విమర్శలు చేయడం మానుకోవాలని వైసిపి మండల నాయకులు హెచ్చరించారు. మంగళవారం వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విమర్శలు చేసేముందు తమ స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. జనసేన నాయకులు పతివాడ శ్రీను, కోట్ల రఘు, పిన్నింటి కుమార్ వంటి వారు పదవుల కోసం పార్టీలు మారే నాయకులని వ్యాఖ్యానించారు. బడ్డుకొండ లేకపోతే డెంకాడ ఎంపిపిగా అయ్యేవాడివా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి తక్కువ జీతంతో యువత కష్టాన్ని దోచుకుంటున్నారని, ఎన్నికల ముందు వాలంటీర్లను వినియోగించి ఎన్నికల తరువాత విస్మరించారని ఆరోపించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి అల్లాడి రమేష్, జెడ్‌పిటిసి ప్రతినిధి మహంతి జనార్ధన్ రావు, ఎంపిపి ప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, ఎడ్ల రామకృష్ణ, గుజ్జు సురేష్ రెడ్డి, మహంతి లక్ష్మణరావు, కోరాడ అరుణ్‌బాబు, శాంతాటి శ్రీనివాసరావు, పల్ల సత్యం, చందగ శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జెడికి వినతినిస్తున్న నాయకులు

జెడికి సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గోవధ నిషేధం, జంతువుల సంరక్షణ కోసం పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ విశేష కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. మంగళ వారం ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేసినప్పుడు గుమ్మ లక్ష్మీ పురం, జియ్యమ్మవలస, కురుపాం, గరుగుబిల్లి వంటి ప్రాంతాల్లో జంతుసంక్షేమంపై అవగాహన సదస్సులు , గో సంరక్షణ కోసం మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారన్నారు కార్యక్రమంలో గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కేదారి శెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు చందక నూకరాజు, భీమపల్లి సంధ్యారాణి, పాల్గొన్నారు.

టెక్ హబ్‌గా విశాఖ

ప్రజాశక్తి - బొబ్బిలి

విశాఖను టెక్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖలో గూగుల్ టెక్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. డేటా సెంటర్ కోసం ఢిల్లీలో ఎంఒయు జరగడం ఆనందంగా ఉందన్నారు. విశాఖను టెక్ హబ్‌గా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖామంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

బాడంగి: గూగుల్ విశాఖ రాకతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. విశాఖ అభివృద్ధి గురించి ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. గూగుల్ టెక్ సంస్థ విశాఖ రావడం లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే విధంగా సిఎం చంద్రబాబు పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించి గూగుల్ సంస్థను విశాఖకు తీసుకువస్తున్నారన్నారు. మొన్న అమరావతికి క్వాంటం వ్యాలీని, నేడు విశాఖకు గూగుల్‌ను తీసుకురావడంతో సుభపరిణామమన్నారు. పెట్టుబడిదారులను అడ్డుకునేందుకు దుష్టశక్తులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి భాస్కర్ రావు, సత్యం పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలోని మంగళవారం ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగారాజు ఆధ్వర్యంలో వైజాగ్‌కి గూగుల్ కంపెనీ రావడం శుభపరిణామం అంటూ భారీగా టిడిపి నాయకులు మిఠాయిలు పంచి పెట్టి మందుగుండి సామగ్రి కాల్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు (విశాఖ నార్త్) సువ్వాడ రవిశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టౌన్ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ అట్టాడ శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రి, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి రాజప్పన్న, కౌన్సిలర్ కింతాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.



రవిశేఖర్‌కు స్వీటు తినిపిస్తున్న కర్రోతు

వైద్యుల సమ్మెకు సంఘీభావం

ప్రజాశక్తి- సంతకవిటి

సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. వీరి సమ్మెకు మంగళవారం సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది సంఘీభావంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి, విధులు నిర్వర్తించారు. జీవో 99తో కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, సమయ నిర్ధారిత ఉద్యోగోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, 104, సంచార చికిత్స అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు వంటి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. శివ భాస్కరం, వై.సురేంద్ర కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: గత కొన్ని రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డెంకాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల డిమాండ్స్ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని ఎపిఎన్‌జిఒ భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ యేసయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ సుహాసిని, హెల్త్ సూపర్ వైజర్ గురుభక్తులు, హెల్త్ విజిటర్ ఎంఎస్‌పి. రాణి, స్టాఫ్ నర్స్ మీనాకుమారి, ఫార్మసిస్ట్ అప్పలనాయుడు, ఎల్‌టి గోవింద్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పంచాయతీల వారీగా నిర్వహిస్తున్న సమిత్రా సర్వేనీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లుకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం, గుర్ల, ఆముదాలవలస, వంగర, సంతకవిటి, రాజాం, మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మూడు విడతలుగా జరపవలసిన సర్వేలో ఇచ్చిన నివేదిక మేరకు జరిపిన సర్వే వివరాలను పంచాయతీలు వారీగా తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మూడు విడతలుగా జరపవలసిన సర్వేకు సంబంధించి ఎటువంటి సహకారం కావాలన్నా జిల్లా అధికారులను సంప్రదించి పూర్తిస్థాయిలో సర్వేను ముగించాలని ఆయన సూచించారు. గ్రామ కంఠాలు, గ్రామాల వారీగా గల నివాసాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి సర్వేలో మూడు విడతలుగా నివేదికను సమర్పించాలని ఆయన సూచించారు. సంబంధిత రెవెన్యూ అధికారుల సహకారాన్ని పూర్తిస్థాయిలో తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఐ సురేష్, ఎఒ ప్రవీణ్ కుమార్, ఏడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమణల పరిశీలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక శ్రీనివాసా కాలనీలో ఇటీవల వర్షాలకు తరచూ నివాస గృహాలు ముంపునకు గురి అవుతున్నందున పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ, పంచాయతీ వార్డు సభ్యుడు డాక్టర్ చిప్పాడ శేషగిరిరావు ఫిర్యాదు మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం ఆక్రమణ గెడ్డ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెడ్డ పక్క స్థలాన్ని ఆనుకొని ఉన్న పది అడుగుల సిసి రోడ్‌ను ఒక వ్యక్తి నిర్మాణ పనుల నెపంతో జెసిబితో గెడ్డ స్థలాన్ని పూడ్చి పదహారడుగులకు విస్తరించారన్నారు. ఇప్పటికే గెడ్డవాగు స్థలం ఆక్రమణలకు గురైందని వరదలు పోటెత్తిన ప్రతీసారీ కాలనీ ముంపునకు గురి అవుతుందని తహశీల్దార్‌కు వివరించారు. ఇలా ఇష్టానుసారంగా గెడ్డ వాగును ఆక్రమించడం, శిథిలాలను, నిర్మాణాల వ్యర్థాలను, కొబ్బరి తదితర చెట్ల కొమ్మలను కూడా నిర్లక్ష్యంగా గెడ్డలో డంపింగ్ చేయడం వల్ల గెడ్డవాగు విస్తీర్ణం కుచించుకుపోయి చిన్నపాటి వర్షానికే కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. జెసిబీతో రహదారి పైన పూడ్చిన మట్టిని తొలగించాలని తహశీల్దార్ సదరు వ్యక్తిని ఆదేశించారు. పంచాయతీ కార్యనిర్వహణాధికారి అనూరాధ, శానిటరీ మేస్త్రీ నానిగిరి కృష్ణతోపాటు ఆక్రమిత ప్రదేశాలను గుర్తించారు. గెడ్డ ప్రవహించే కాలువ విస్తీర్ణ దిశగా చర్యలు తీసుకోవాలని, పూడికను కొన్ని అడుగుల లోతు మేర జెసిబీ ఉపయోగించి తొలగించాలని ఇఒకి సూచించారు.

విధ్వంసకర పాలన చేస్తున్నది మీరా! మేమా? : వైసిపి

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్రంలో విధ్వంసకర పాలనను చేస్తున్నది మీరా! మేమా! అని కూటమి నాయకులను వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం వలి రెడ్డి శ్రీనివాస్ నాయుడులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మంగళవారం మాట్లాడారు. పట్టణంతో పాటు నియోజకవర్గానికి ఇందిరమ్మ సుజల స్రవంతి పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు తీసుకువచ్చిన ఘనత బొత్స సత్యనారాయణదేనన్నారు. నియోజకవర్గంతో పాటు విజయనగరం జిల్లానీ అభివృద్ధి పథంలో నడిపించిన బొత్స సత్యనారాయణపై మాట్లాడడం కళా వెంకటరావుకు తగదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నెలలు అయిందని ఈ 16 నెలలో ప్రెస్ మీట్‌లు, తప్ప మీరు చేసింది ఏమైనా నియోజకవర్గానికి ఉందా అని ప్రశ్నించారు. ఆర్ఇసిఎస్‌ని పునరుద్ధరిస్తానని చెప్పిన సంగతి మర్చిపోయారా అని ఎమ్మెల్యే కళాను ప్రశ్నించారు. చీపురుపల్లి ఏరియాస్పత్రికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్పటికీ వాటిని సద్వినియోగం చేయడంలో కళా వెంకటరావు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్ కోరాడ పృధ్వి, కర్రోతు రమణ, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ జెవివి రామ్మోహనరావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం పీసీ అండ్ పిఎన్‌డిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలు పట్ల వివక్షత చూపడం నేరమన్నారు. గర్భంలో పెరుగుతున్న శిశువును తెలుసుకునేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలన్నారు. మూఢ నమ్మకాలను నివారించేందుకు పని చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి సంతోషిణి, చిన్నపిల్లలు వైద్యులు సంధ్య, ఏఎస్ఐ బివి స్వామి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

చెకుముకి గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండల విద్యా వనరుల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న జరగనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను మండల విద్యాశాఖ అధికారులు ఎం. చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాల స్థాయిలో 8,9,10 తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల్లో తరగతికి ఒక్కరు చొప్పున ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు సిద్ధం చేయాలన్నారు. మండలంలో ఉన్న ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులను పరీక్షలకు తయారు చేయాలని చెప్పారు. ఈ పరీక్షలు ఎంతమంది విద్యార్థులు రాయనున్నారో 16వ తేదీ సాయంత్రం లోపు జన విజ్ఞాన వేదిక మండల ప్రతినిధులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రఘునాథరాజు, ఎల్ సింహాద్రి, మాడుగుల రమణ, మండల వెంకట చిన్నప్పలనాయుడు, బి నవీన్ పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జిఎస్‌టిపై మరింత అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిఎస్‌టిపై మరింత అవగాహన కల్పించాలని ఎపి మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారాజు సూచించారు. మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్‌సి కార్పొరేషన్ ఈడి, మండల ప్రత్యేకధికారి డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయిలో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టిపై ప్రజల్లోకి వెళ్లి మరింత అవగాహన కల్పించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు, (విశాఖపట్నం నార్త్)సువ్వాడ రవి శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు,నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, జనసేన నాయకులు యడ్ల గోవిందరావు, కరుమజ్జి గోవింద, ఎంపిడిఒ కె. రామకృష్ణ రాజు, నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: 'సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్'తో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎలా మేలు జరిగిందో, జిఎస్‌టి సంస్కరణలతో కూడా అలాగే మేలు జరుగుతోందన్నారు. స్వదేశీ, మేక్ ఇన్ ఇండియాకు ఊతమిస్తూ, భారతీయ బ్రాండ్లు గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని తెలిపారు.

విజయనగరం టౌన్: జిఎస్‌టి 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి, రైతాంగ ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని ఎమ్మెల్యే అదితి అన్నారు. మంగళవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు భవన నిర్మాణ ఆధారిత సామగ్రితో కూడిన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను ఎమ్మెల్యే అతిథితో సహా కమిషనర్ పల్లి నల్లనయ్య, కమర్షియల్ టాక్స్ జాయింట్ డైరెక్టర్ జి. నిర్మలా జ్యోతి, జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణమూర్తి, క్రిడై ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, క్రిడై ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

డిఎస్‌సి 2025 నియామకాల్లో భాగంగా మంగళవారం మండలంలో 36 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ వెల్లడించారు. ఫిజికల్ సైన్స్ 6 పోస్టులు, సోషల్ స్టడీస్ 8, గణితం 2, ఇంగ్లీష్ 3, బయాలజీ 4, హిందీ 5, తెలుగు 1, పీడీ 3, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 4 పోస్టులు చొప్పున మంజూరైనట్లు వివరించారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎంఇఒలతో పాటు ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది అభినందనలు తెలిపారు. తొలిరోజు పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందించారు.

సిహెచ్‌సిలో మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిహెచ్‌సిలో మెరుగైన సేవలు అందించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో బెడ్లు, గదులు కొరత వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో నూతనంగా నిర్మాణం ప్రారంభించిన ఆసుపత్రి అదనపు గదులు ఇంత వరకూ పూర్తి కాకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే సామజిక ఆసుపత్రికి వందల్లో రోగులు వైద్యం కోసం వస్తున్నారని వారికి బెడ్లు, గదులు చాలక బయట వరండాల్లో చికిత్స చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా నూతన ఆసుపత్రి పూర్తి చేయడం పై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

తూనికలు, కొలతల శాఖ ఆకస్మిక తనిఖీలు


ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో తూనికలు, కొలతలు శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వంట నూనె, స్వీట్, మాసం దుకాణాలు (చికెన్, మటన్, చేపలు), కిరణా వ్యాపార సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న 11 షాపులపై కేసులు నమోదు చేశామని విజయనగరం లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు బి.మనోహర్ తెలిపారు. జిల్లాలో వ్యాపార సంస్థలపై ఈ వార్షిక సంవత్సరానికి గాను 557 కేసులు నమోదు చేసి ముద్ర రుసుం కింద రూ.34.12లక్షలు, రాజీ రుసుం కింద రూ.24.12లక్షలు వసూలు చేశామన్నారు. వినియోగదారుల హక్కులను, మోసాలను పరిరక్షించేందుకు లీగల మెట్రాలజి శాఖ ప్రత్యేక దాడులను తరచుగా నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా తూనికలు, కొలతలు సంబంధించిన ఏవిధమైన మోసాలను గుర్తించినా వెంటనే 9398145360, 9703353679, 9703353679 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని చెప్పారు.

గెడ్డలో పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని చంద్రంపేట ఆరవసంత గెడ్డ వాగులోని సోమవారం రాత్రి విజ్జపు సోమరాజు (55) పడి గల్లంతయ్యాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకపోవడంతో పలుచోట్ల వెతికి బంధువుల ఇళ్లల్లో కూడా వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో గెడ్డలోని కొట్టుకుపోయి ఉంటాడని ఉద్దేశంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటలు తర్వాత స్థానికులు గెడ్డలో మునిగి ఉన్న మోపెడ్ బండిని గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గంట్యాడ తహశీల్దార్ నీలకంఠశివ రెడ్డికి గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, ఎంపిడిఒ రమణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని ఎపి ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినీ ఫలితం లేకపోయింది. విఆర్ఒ రవి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలుపుదల చేశారు. విషయాన్ని తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు నాయకులు ఆళ్ళ విజయ్‌కుమార్, రంది చిన్న రామునాయుడు, బూడి గాంధీ, అర్జున్ మాస్టారు, రంది రామనాయుడు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు.



గెడ్డలో గాలిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ బృందం